# దళితుల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ హెచ్ బ్లాక్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ తరఫున ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, స్థానిక కార్పొరేటర్ దేదీప్యవిజయ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఉప్పలపాటి అనూషరామ్



బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



మోతీనగర్‌లో నిర్వహించిన సదర్ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత

**బంజారాహిల్స్/వెంగళరావునగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** దళితుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి బీఆర్ఎస్ తీవ్రంగా కృషి చేసిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. షేక్‌పేట్ డివిజన్ బీజేఆర్‌నగర్ హరిజన భవన్‌లో దళిత సంఘం నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ కాలం నుంచి దళితులు బీఆర్ఎస్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అందుకే అప్పటి సీఎం కేసీఆర్ దళితుల అభివృద్ధికి 50 వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్టు గుర్తు చేశారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఐపీఎస్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు నందికంటి శ్రీధర్, షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్, చెరక మహేష్ పాల్గొన్నారు.

### సదర్‌లో ప్రచారం

మోతీనగర్, అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడలో జరిగిన సదర్ వేడుకల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కుమారుడు వాత్సల్యనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపూజ చేశారు. అనంతరం సునీత మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ ఆశయాలను కొనసాగించేందుకే తాను రాజకీయాలకు వచ్చినట్టు చెప్పారు. ప్రతీ ఒక్కరు తనకు మద్దతుగా నిలవాలని కోరారు.



బేగంపేటలోని ఓ పాఠశాల విద్యార్థులతో కలిసి టపాసులు కాలుస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రమేష్ తదితరులు

- బేగంపేట, ఆంధ్రజ్యోతి

### కార్తీక పూజలు



కార్తీకమాసం సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన వేదపండితులు

- బేగంపేట, ఆంధ్రజ్యోతి



ప్రచారంలో భాగంగా వెంకటగిరి హైలంకాలనీలో బజ్జీలు వేస్తున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

## శిశు విహార్ ఆయాలకు వేతన బకాయిలు చెల్లించాలి

**పంజాగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని శిశు విహార్‌లో పనిచేస్తున్న ఆయాలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం మధురానగర్‌లో యూనియన్ ఆధ్వర్యంలో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా ఆయాలకు వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పది నెలలుగా పీఎఫ్ జమ చేయడం లేదని, ఈఎస్ఐ ఆస్పత్రుల్లో చికిత్స కూడా అందడం లేదని ఆరోపించారు. ఆయాలు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే విధులు బహిష్కరించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సుశీల, ఆదిలక్ష్మి, పద్మ, కవిత, రాజేశ్వరి, నర్సమ్మ పాల్గొన్నారు.

## న్యాయం జరిగే వరకూ నిరసనలు : ఔటా



నిరసన తెలియజేస్తున్న ఔటా నాయకులు

**ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** ఉస్మానియా యూనివర్సిటీలో పదోన్నతుల విషయంలో జరిగిన అన్యాయంపై నిరసనలు కొనసాగుతాయని ఔటా అధ్యాపకులు స్పష్టం చేశారు. బుధవారం కెమిస్ట్రీ విభాగం ఎదుట నిర్వహించిన నిరసనలో ఔటా అధ్యక్షుడు ప్రొ.మనోహర్ మాట్లాడారు. అధ్యాపకులు రోజూ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు లేఖ అందజేశామని, ఇప్పటి వరకు ఎటువంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమందికి పదోన్నతులు ఎందుకు నిలిపివేశారో అధికారికంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో ప్రొఫెసర్ వెంకటదాసు రాసిన కవిత్వ రూపంలోని కరపత్రం చర్చనీయాంశమైందని, ఆ కరపత్రం ఆయన వ్యక్తిగత అభిప్రాయమేనని ఔటా అధ్యక్షుడు మనోహర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ప్రొ.సురేందర్, ప్రొఫెసర్లు వెంకటదాసు, మాధురి, సుజాత, రోజారాణి, పద్మజ, గంగాధర్, అరవింద్ పాల్గొన్నారు.

## టపాసులు కాల్చొద్దు అన్నందుకు ఘర్షణ

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** దీపావళి పండుగ రోజు టపాసులు కాల్చే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న యాదగిరినగర్ కమాన్ గల్లీలో దీపావళి పండుగ సందర్భంగా కలీం అనే వ్యక్తి టపాసులు కాలుస్తుండగా రఫత్ సయ్యద్ వద్దని చెప్పారు. దీంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. ఇరు కుటుంబాల వారు ఘర్షణ పడుతుండగా 100కు ఫోన్ చేసి స్థానికులు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులకు మహిళలు, పురుషులు బూతులు తిట్టుకుంటూ, పిడి గుద్దులు గుద్దుకుంటున్న ఇరువర్గాలను చూసి చెదరగొట్టారు. ఘర్షణకు కారణమైన కలీం, రఫత్ సయ్యద్‌ను అదుపులోకి తీసుకొని ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

**మరోచోట..**

లక్ష్మీనరసింహ నగర్‌కు చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ కాకర్స్ కాల్చి సమీపంలోని ప్రార్థన మందిరంలోకి విసిరారని ఇదే బస్తీకి చెందిన సయ్యద్ సాదిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## పోరాట యోధుడు కొమురం భీం : ఓయూ వీసీ



కొమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు

**ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** కొమురం భీం గొప్ప పోరాట యోధుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఓయూ వైస్ చాన్స్‌లర్ కుమార్ మొలుగరం అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పూలే, అంబేడ్కర్ సెంటర్ ఫర్ ఇన్‌క్లూజివ్ అండ్ ఎంపవర్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో బుధవారం కొమురం భీం 124వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ కొమురం భీం సేవలను, ఆయన స్ఫూర్తిని భావి తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల అభ్యున్నతికి అవగాహనా కార్యక్రమాలు, వర్క్‌షాపులు, సెమినార్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి, ఓఎస్‌డీ ప్రొ.జితేందర్‌కుమార్‌నాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.లావణ్య, బీసీ సెల్ డైరెక్టర్ డా.ఉపేందర్, మైనారిటీస్ సెల్ డైరెక్టర్ ప్రొ.హమీదా పాల్గొన్నారు.

**ఆర్ట్స్ కళాశాల వద్ద నివాళి..**

ఓయూలోని ఆర్ట్స్ కళాశాల వద్ద బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓయూ అంస అధ్యక్షుడు నామ సైదులు, ఎంఎస్ఎఫ్ నాయకులు స్వామి, బీసీ విద్యార్థి సంఘం నాయకులు లింగయ్య యాదవ్, రవీందర్, విజయ్‌నాయక్, అర్జున్, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

## అక్రమ భూ విక్రయాలను వెంటనే అడ్డుకోవాలి

**పంజాగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** కోట్లాది రూపాయల విలువైన భూములను అక్రమంగా విక్రయించాలని ప్రయత్నిస్తున్న వారిని నిలువరించి, ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకోవాలని కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ బాలానగర్ మాజీ చైర్మన్ సయ్యద్ బద్రుద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గుమ్మడిదలలో కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ బాలానగర్‌కు చెందిన 161 ఎకరాల భూమి ఉందన్నారు. సదరు భూమిని ప్రస్తుత డైరెక్టర్లు అక్రమంగా విక్రయించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారని ఆరోపించారు. సొసైటీ సభ్యులకు చెందాల్సిన భూమిని ఓ ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థకు గజం కేవలం రూ.669 చొప్పున విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సదరు భూమిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం 2005లో స్టేటస్‌కో విధించగా, దానిని ధిక్కరించి జిల్లా కో-ఆపరేటివ్ అధికారి విక్రయాలకు అనుమతించడం ఏమిటని, 500 కోట్లకు పైగా పలికే భూమిని అతి తక్కువ ధరకే విక్రయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ అంశంపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా కేసును స్వీకరించాలని కోరారు.

## ఒకరి అవయవదానం.. ముగ్గురికి ప్రాణదానం



అలివేలు

**నిమ్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** ఓ మహిళ బ్రెయిన్ డెడ్ అయ్యింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడకు చెందిన తుమ్మల అలివేలు(50) గృహిణి. ఈమెకు తరచూ వాంతులయ్యేవి. ఈనెల 14న వాంతులవడంతోపాటు స్పృహ కోల్పోవడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. 21వ తేదీన ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నిమ్స్ జీవన్‌దాన్ వైద్యులు ఆమె కుమారుడు సాయివర్ధన్‌రెడ్డికి అవయవ దానంపై అవగాహన కల్పించారు. అందుకు ఆయన అంగీకరించడంతో బుధవారం లివర్, రెండు కార్నియాస్ సేకరించి ముగ్గురికి అమర్చారు.



హనుమాన్ ఆలయ నూతన ధర్మకర్తలు

## ధర్మకర్తలు విశేష సేవలందించాలి

**అమీర్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** అమీర్‌పేట హనుమాన్ ఆలయ నూతన ధర్మకర్తలు భక్తులకు విశేష సేవలందించాలని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి అన్నారు. నూతన ధర్మకర్తలు గుడిగె సత్యనారాయణ యాదవ్, కె.అశోకచారి, డప్పు కృష్ణ, ఎస్.శ్రీనివాసరావు, మంచికంటి అనిత, కాసాని శ్రీశైలం గౌడ్, ముద్దికొండ శ్రీనివాస్, గుగులోత్ శోభాబాయి, పి.దేవిబాయి, సురవి హరిశంకర్‌గౌడ్, ఎక్స్ అఫీషియో సభ్యుడు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్‌శర్మతో ఆమె బుధవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఈవో జయంతి, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీమణి, అర్చకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**పంజాగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ గోల్డెన్ టెంపుల్, మెహర్ బాబా ఫీడర్ల పరిధి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయం, అయ్యన్ ప్లైడ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

**గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..**

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ డీఎస్ఎం కాలనీ ఫీడర్ పరిధి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ ఆదిత్య ఎన్‌క్లేవ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

# ఉపాధికి కొత్తదారులు!



ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులకు బోధన




అల్వాల్‌లో నిర్మించిన ఆధునిక టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)

### ఏటీసీలతో సాంకేతిక విద్య.. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో శిక్షణ

**అల్వాల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** పదోతరగతి పాసైన విద్యార్థులకు ఉపాధి మార్గం దిశగా ప్రభుత్వం కొత్త దారి చూపుతోంది. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా మానవ వనరులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీలను ప్రారంభించింది. అల్వాల్‌లో రూ.35కోట్లతో నిర్మించిన ఈ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించి.. విద్యార్థులకు పరిశ్రమ 4.0 టెక్నాలజీపై కోర్సులను బోధిస్తోంది. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న ఈ కేంద్రం నూతన దిశకు తెరలేపింది.

**ఏటీసీలో ఆధునిక కోర్సులు..**

అల్వాల్‌లో 13,500 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించిన ఆధునిక టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ఇందులో ఆరు ఆధునిక కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకవచ్చారు. మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ మెకానికల్, అడ్వాన్స్‌డ్ సీఎన్సీ మెషనింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిక్ ట్రేడ్‌లలో శిక్షణ అందిస్తున్నారు. అధునిక కాలానికి అనుగుణంగా సిలబస్‌ను రూపొందించారు. ప్రతీ సెంటర్‌లో 172 మంది విద్యార్థులకు శిక్షణ పొందే అవకాశం కల్పించగా.. ఒక సంవత్సరం, రెండు సంవత్సరాల వ్యవధిలో కోర్సులు పూర్తి చేసేలా ఏర్పాటు చేశారు.

### టెక్నీషియన్ కోర్సులు నేర్చుకుంటున్నాం



ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ కోర్సుతో డిజైన్‌సాఫ్ట్‌వేర్, (ఆటో క్యాడ్, సాలిడ్ వర్క్స్, కాటియా) తదితర కోర్సులను నేర్చుకుంటున్నాం. ఈ కోర్సులను నేర్చుకోవడం ద్వారా మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎరోనాటికల్, ఆటోమొబైల్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ రంగాల్లో డిజైన్ టెక్నీషియన్‌గా మంచి ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశం ఉంది.

- మానస, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ కోర్సు విద్యార్థి

### విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏటీసీ కేంద్రాలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. వందశాతం అడిష్మన్లు పూర్తి చేశాం. ఈ కేంద్రాల్లో ప్రారంభించిన కోర్సులను విద్యార్థులు పూర్తి చేస్తే పరిశ్రమల్లో మంచి అవకాశాలు లభిస్తాయి. పూర్తిగా ఆధునిక యంత్రాలపై శిక్షణ అందిస్తున్నాం.

- శంకరయ్య, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ అల్వాల్

# ప్రమాదకరంగా కటౌట్‌లు

- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహనదారులు



మసీద్‌బండ నుంచి హెచ్‌సీయూకు వెళ్లే రోడ్డు అంచులో ప్రమాదకరంగా ఉన్న కటౌట్



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పాపిరెడ్డినగర్ కాలనీకి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న కటౌట్

**చందానగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** విందులు, వినోదాలు, జన్మదిన వేడుకలు, బహిరంగ సభల సూచికగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు. వాటిని రోడ్ల అంచుల్లోనూ, మధ్యలోనూ ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు రాకపోకల సమయంలో ప్రమాదాలకు దారితీసే విధంగా ఉంటున్నాయి. రాజకీ య పార్టీలకు సంబంధించిన భారీ కటౌట్‌లు సైతం ప్రమా దాలకు కారణంగా నిలిచేలా ఉంటున్నాయని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమదాలు జరుగుతాయనే విషయం అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవరిస్తున్నారని, ఇది మంచిది కాదని పలువురు అంటున్నారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్ల అంచుల్లో ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటుపై నిషేధం ఉండేది. ఎవరైనా ఏర్పాటు చేసినా వెంటనే అధికారులు తొలగించేవారు. లేదా ఏర్పాటు చేసిన వారే స్వయంగా తీసివేసేవారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఇప్పుడు ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి అంచుల్లోనూ భారీ కటౌట్‌లు పెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సోషల్ మీడియాలో వీడియో వివాదం

- ఇరువర్గాల మధ్య ఘర్షణ.. కేసులు నమోదు

**పంజాగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** సోషల్ మీడియాలో వీడియో వివాదం ఎర్రమంజిల్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోవడంతో పంజాగుట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎర్రమంజిల్ కాలనీలో ఈనెల 21న జరిగిన ఓ పుట్టినరోజు వేడుక సందర్భంగా పోస్ట్ చేసిన వీడియో వివాదానికి దారి తీసింది. పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారు వేర్వేరుగా పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరువర్గాలకు చెందిన పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

## రేడియాలాజికల్ ఫిజిక్స్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

**ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో, నగరంలోని ప్రముఖ ఆస్పత్రుల సహకారంతో నిర్వహిస్తున్న పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియాలాజికల్ ఫిజిక్స్ కోర్సు (2025-26)లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు ఫిజిక్స్/న్యూక్లియర్ ఫిజిక్స్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి నవంబరు 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, రూ.500 లేటు ఫీజుతో నవంబరు 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నవంబరు 30న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలని, పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఓయూఅడ్మిషన్స్.కాం, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్లను సందర్శించాలని పాండురంగారెడ్డి సూచించారు.



సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

## కంటోన్మెంట్ అభివృద్ధిపై హర్షం

**మారేడుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కంటోన్మెంట్ బోర్డుకు లభించిన రూ. 303 కోట్లతో నాలాలు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టనున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పికెట్ చౌరస్తాలో డాక్టర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రావ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సంకి రవీందర్ బాబు, బద్రీనాథ్ యాదవ్, జమీల్ భై, పెదాల నర్సింహ యాదవ్, కంటోన్మెంట్ బోర్డ్ నాలుగో వార్డ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డి. సత్యనారాయణ, శ్రీరామ ఆనంద్, సంతోష్ యాదవ్, గణేష్ టెంపుల్ చైర్మన్ అరవింద్ యాదవ్, సుబ్రహ్మణ్యస్వామి టెంపుల్ చైర్మన్ రేపల్లే వెంకటేష్, మారుతి గౌడ్, దర్గా రవి, నాగేష్ యాదవ్, అష్రఫ్ భై తదితరులు పాల్గొన్నారు.

## తెల్ల కోటు.. స్వచ్ఛతకు నిదర్శనం

● డీఎంఈ డాక్టర్ శివరాం ప్రసాద్

**అడ్డగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :** తెల్లకోటు అనేది స్వచ్ఛతకు నిదర్శమని, వైద్య విద్యార్థులు కష్టపడి చదివి వైద్య వృత్తి చేపట్టి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని అకడమిక్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ శివరాం ప్రసాద్ సూచించారు. బుధవారం గాంధీ మెడికల్ కాలేజీ-2025 బ్యాచ్ వైద్య విద్యార్థులతో నిర్వహించిన 'వైట్ కోట్ సెరిమని' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య విద్యార్థులకు వైట్‌కోట్‌ను అందజేశారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని కష్టపడి చదివి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ రవి శేఖర్, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజారావు, వైద్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమాదేవి, సుధారాణి, సుధాకర్ బాబు, ప్రజ్ఞ, గాంధీ ఆస్పత్రి ఆర్‌ఎంఓ 1 డాక్టర్ శేషాద్రి, మెడికల్ కాలేజీ ఎంపిహెచ్‌ఓ వేణుగోపాల్‌లు పాల్గొన్నారు.

## తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

**బౌద్ధనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** వారాసిగూడ - మహ్మద్‌గూడ ప్రధాన రహదారిలో ఉన్న తాగునీటి పైపులైన్‌కు జలమండలి సిబ్బంది బుధవారం మరమ్మతులను చేపట్టారు. మూడునెలల క్రితం ఈ పైపులైన్ నుంచి సిబ్బంది స్థానికంగా ఉన్నవారికి నూతన కనెక్షన్ ఇచ్చారు. ఈ పైపులైన్ కనెక్షన్‌ను సవ్యంగా చేయకపోవటంతో రోడ్డు కుంగి గుంతగా ఏర్పడింది. దీంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. తాగునీటి సరఫరా కూడా సవ్యంగా రాకపోవడంతో స్థానికులు బీఆర్‌ఎస్ నేత సంజీవ ముదిరాజ్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన బౌద్ధనగర్ జలమండలి మేనేజర్ ప్రియాంక, సిబ్బంది శ్రీకాంత్ దృష్టికి తీసుకురావటంతో వారు యుద్ధప్రాతిపదిక మీద మరమ్మతులు చేపట్టారు. తాగునీటి సరఫరా సవ్యంగా వచ్చేలా మరమ్మతులు చేపట్టామని మేనేజర్ తెలిపారు.



తాగునీటి పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న మేనేజర్ ప్రియాంక తదితరులు

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**చిలకలగూడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** రైల్వే పెన్షనర్లకి మెరుగైన వైద్య సౌకర్యాలు, వారి సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ అసోసియేషన్లు చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పేర్కొన్నారు. చిలకలగూడ ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ డివిజన్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కె.సుదర్శన్, డివిజనల్ కార్యదర్శి క్యాసద్ర జేవియర్‌లకి అభినందనలు తెలిపి శాలువతో సత్కరించారు. అనంతరం రాఘవయ్య మాట్లాడుతూ కారుణ్య నియామకాలు, సెకండరీ ఫ్యామిలీ పెన్షన్ మంజూరు, మెరుగైన వైద్య సౌకర్యాల కల్పన, డిజిట్ లైఫ్ సర్టిఫికెట్ అందజేత వంటి అంశాలకు ప్రాధాన్యమిచ్చి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేష్ ఆఫ్ రైల్వేస్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.సి రామకృష్ణాచార్యులు, జాయింట్ జనరల్ సెక్రటరి ఎ.జి.కె.మూర్తి, గోవింద రాజులు, ఇస్మాయి తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన్‌ను సత్కరిస్తున్న మర్రి రాఘవయ్య తదితరులు

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**తిరుమలగిరి అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందని స్థానికులు తిరుమలగిరి పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు బుధవారం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సుమారు మృతుడికి 60 సంవత్సరాలు ఉంటాయని ఎస్సై కరుణాకర్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తిరుమలగిరి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



మహేష్(ఫైల్)

**అడ్డగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :** మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడ్డగుట్ట డి-సెక్షన్‌కు చెందిన మహేష్(30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన మహేష్ తరుచుగా భార్యతో గొడవ పడేవాడు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో అందరు పడుకుని ఉండగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య వెంటనే స్థానికులకు సమాచారం ఇచ్చిన అనంతరం తుకారాంగేట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించిన అనంతరం మృతదేహాన్ని భార్యకు అప్పగించారు.

## లారీ డ్రైవర్ అరెస్ట్

**తార్నాక, అక్టోబరు 22 (అంధ్రజ్యోతి):** నిర్లక్ష్యంగా డీసీఎం వాహనాన్ని నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి పరారైన డ్రైవర్‌ను నాచారం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. బోడుప్పల్ ప్రాంతానికి చెందిన వేణు మాధవరెడ్డి ఈ నెల 14న తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా నాచారంలోని శ్రీకృష్ణ ఫార్మాస్యూటిక్ వద్ద లారీ ఢీకొన్న విషయం తెలిసిందే. వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. అనంతరం నాచారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు వేణుమాధవ రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా లారీ డ్రైవర్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. లారీ డ్రైవర్‌ను అరెస్టు చేసిన కానిస్టేబుల్ వెంకటేశ్వర్లను సీఐ ధనుంజయ అభినందించి రివార్డును అందజేశారు.



సదర్ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



సదర్ వేడుకల్లో దున్నపోతుకు పూజలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సి. వైష్ణవి



బోయినపల్లిలో జరిగిన సదర్ సంబరాల్లో పాల్గొన్న జంపన ప్రతాప్, మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్

# ఘనంగా సదర్ సంబరాలు

● ప్రేక్షకులను అలరించిన విన్యాసాలు

● పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు

● ఆకట్టుకున్న హర్యానా దున్నపోతు

**తిరుమలగిరి అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** బొల్లారంలోని రిసాల బజార్ లో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనం వేడుకలు ఘనంగా జరిగాయి. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సమ్మేళన ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదవ సమాజం ఐకమత్యానికి, సాంస్కృతిక గొప్పతనానికి ప్రతీక అయిన సదర్ పండుగను పురస్కరించుకుని పశువులకు పూజ చేయడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్, మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, జీవి బాల్‌రాజ్, జంగాల మురళీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**బోయినపల్లిలో..**

**బోయినపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** బోయినపల్లి స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో బోయినపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు ఆరవ వార్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్, బోయినపల్లి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్‌లు హాజరై శ్రీకృష్ణుడికి దున్నపోతులకు ప్రత్యేక పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. సదర్ వేడుకల సందర్భంగా అందంగా అలంకరించిన దున్నపోతులను డీజే పాటలకు అనుగుణంగా ఆడించిన విన్యాసాలు ప్రేక్షకులను ఆకర్షించాయి. అనంతరం వివిధ పార్టీలు, నాయకులు యాదవ సంఘం నాయకులు చేసిన తీన్మార్ నృత్యాలు అందరిని విశేషంగా ఆకర్షించాయి.



దున్నరాజుతో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్

**మారేడుపల్లిలో..**

**మారేడుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** మారేడుపల్లిలోని మైసమ్మ ఆలయం ఆవరణలో మంగళవారం రాత్రి సీత సన్నీ యాదవ్, సి.రాజు యాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన సదర్ వేడుకలకు ఆహ్వానితులుగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సి. వైష్ణవి, మారేడుపల్లి మైసమ్మ ఆలయ నిర్వాహకులు సి.కృష్ణ యాదవ్‌లు పాల్గొన్నారు. సదర్ వేడుకలను పురస్కరించుకుని హర్యానా నుంచి తీసుకువచ్చిన దున్నపోతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సదర్ వేడుకలను తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. అంతకుముందు దున్నపోతుకు ఆలయం ముందు పూజలు నిర్వహించి హారతి ఇచ్చి డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఈస్ట్ మారేడుపల్లికి తీసుకువెళ్లారు.

## లాలాపేట్‌లో సీపీఐ సదస్సు

**తార్నాక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :** భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సమాజం ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కార మార్గాలు అనే అంశంపై ఆ పార్టీ నాయకులు కొమరెల్లి బాబు అధ్యక్షతన బుధవారం లాలాపేట్‌లో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ కన్నెగంటి రవి, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోపిడి, పీడన లేని సమాజం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా పని చేస్తుందని, దాంతో కేంద్రం అండదండలతో కార్పొరేట్ శక్తులు పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుంచి మొదలుకొని ఇప్పటివరకు కొనసాగుతున్న పాలకవర్గానికి వ్యతిరేకంగా సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించి ప్రజల హక్కులను సాధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, అడ్డగుట్ట కార్యదర్శి యాదగిరి, గౌరీ నాగరాజు, తార్నాక కార్యదర్శి సయ్యద్ గౌస్, శోభ, సువర్ణ, రాములు, యాకయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కోకన్వీనర్ కన్నెగంటి రవి తదితరులు

# పోరాట యోధుడు కొమరం భీం: ఓయూ వీసీ

**ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** కొమరం భీం గొప్ప పోరాట యోధుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఓయూ వైస్ చాన్స్‌లర్ కుమార్ మొలుగరం అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పూలే, అంబేడ్కర్ సెంటర్ ఫర్ ఇన్‌క్లూజివ్ అండ్ ఎంపవర్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో బుధవారం కొమరం భీం 124వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ, కొమరం భీం సేవలను, ఆయన స్ఫూర్తిని భావి తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల అభ్యున్నతికి అవగాహనా కార్యక్రమాలు, వర్క్‌షాపులు, సెమినార్‌లు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి, ఓఎస్‌డీ ప్రొ.జితేందర్‌కుమార్ నాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.లావణ్య, బీసీ సెల్ డైరెక్టర్ డా.ఉపేందర్, మైనారిటీస్ సెల్ డైరెక్టర్ ప్రొ.హమీదా పాల్గొన్నారు.



కొమరం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు

**ఆర్ట్స్ కళాశాల వద్ద నివాళి..**

ఓయూలోని ఆర్ట్స్ కళాశాల వద్ద బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓయూ అంస అధ్యక్షుడు నామ సైదులు, ఎంఎస్‌ఎఫ్ నాయకులు స్వామి, బీసీ విద్యార్థి సంఘం నాయకులు లింగయ్యయాదవ్, రవీందర్, విజయ్‌నాయక్, అర్జున్, అంజనేయులు, రవి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం జరిగే వరకు నిరసనలు కొనసాగిస్తాం

● ఔటా నాయకులు

**ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** ఉస్మానియా యూనివర్సిటీలో పదోన్నతుల విషయంలో జరిగిన అన్యాయంపై నిరసనలు కొనసాగుతాయని ఔటా అధ్యాపకులు స్పష్టం చేశారు. బుధవారం కెమిస్ట్రీ విభాగం ఎదుట నిర్వహించిన నిరసనలో ఔటా అధ్యక్షుడు ప్రొ.మనోహర్ మాట్లాడారు. అధ్యాపకులు రోజూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు లేఖ అందజేశామని, ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమందికి పదోన్నతులు ఎందుకు నిలిపివేశారో అధికారికంగా వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో ప్రొఫెసర్ వెంకటదాసు రాసిన కవిత్వ రూపంలోని కరపత్రం చర్చనీయాంశమైందని, ఆ కరపత్రం ఆయన వ్యక్తిగత అభిప్రాయమేనని ఔటా అధ్యక్షుడు మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ప్రొ.సురేందర్, ప్రొఫెసర్లు వెంకటదాసు, మాధురి, సుజాత, రోజా రాణి, పద్మజ, గంగాధర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఔటా నాయకులు



ఎస్.ఆర్ శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్వేరోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్

## ఘనంగా స్వేరోస్ ఆవిర్భావ దినోత్సవం

**ముషీరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) :** స్వేరోస్ 13వ ఆవిర్భావ దినోత్సవాలను స్వేరోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తిమ్మన వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ముషీరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరోస్ జెం డా ఆవిష్కరించి గురుకుల పాఠశాలల వ్యవస్థాపకుడు దివంగత కలెక్టర్ ఎస్.ఆర్ శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా వినోద్ కుమార్ మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత వి ద్య అభ్యసించేందుకు గురుకుల విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఎస్.ఆర్ శంకర్ సామాజిక స్పృహతో అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి నిరక్ష్యరాస్యత నిర్మూలనకు కృషిచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వసంత, అధికా ర ప్రతినిధి వంశీ, నాయకులు అనిల్, ఆజాద్, దాసు, వెంకటేష్ పాల్గొన్నారు.



బేగంపేటలోని ఓ పాఠశాల విద్యార్థులతో కలిసి టపాసులు కాలుస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రమేష్ తదితరులు

- బేగంపేట, ఆంధ్రజ్యోతి



### కార్తీక పూజలు

కార్తీకమాసం సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన వేదపండితులు

- బేగంపేట, ఆంధ్రజ్యోతి

## కాలనీలు, బస్తీల్లో సమస్యలు పరిష్కరించాలి

● శ్రీగణేష్‌కు జంపన వినతి

**సికింద్రాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.303 కోట్లతో కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీల్లో సమస్యలు పరిష్కరించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేశ్‌కు కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. 4వ వార్డులోని పికెట్ నాలా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, భవానీ నగర్ నుంచి ప్రవహించే హస్మత్‌పేట్ నాలాను అభివృద్ధి చేయాలని, రామన్న కుంట చెరువు ప్రక్షాళన, సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, 2,3వ వార్డులను కలిపే పి అండ్ టి కాలనీ-మార్గదర్శి కాలనీ నాలా, 6వ వార్డులోని మాలానీ కాలనీ-1వ వార్డులోని అయ్యప్ప సొసైటీ వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. డైమండ్ పాయింట్, సెంటర్ పాయింట్, మస్తానా సర్కిళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అభివృద్ధి చేయాలని, 6వ వార్డులోని మహాత్మానగర్-హస్మత్‌పేట్ సర్కిల్ మధ్య, బోయినపల్లి మార్కెట్-తిరుమలగిరి సర్కిల్ మధ్య రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. 1వ వార్డులోని బాపూజీనగర్ సర్కిల్‌ను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.



కాళీమాతకు పూజలు నిర్వహిస్తున్న బెంగాలీలు

## భక్తిశ్రద్ధలతో కాళీమాత పూజలు

**రాంగోపాల్‌పేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :** భక్తిశ్రద్ధల నడుమ కాళీమాత పూజలను బెంగాలీలు ఘనంగా బుధవారం నిర్వహించారు. స్వామి వివేకానంద బెంగాలీ స్వర్ణశిల్పి అసోసియేషన్ సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో 23 సంవత్సరాలుగా నిర్వహిస్తోంది. అందులో భాగంగా దీపావళి నుంచి ప్రత్యేకంగా నెలకొల్పిన నిలువెత్తు అమ్మవారి విగ్రహానికి మూడు రోజులుగా పూజలను చేశారు. చివరి రోజైన బుధవారం దాదాపు రెండు వేల మందికి అన్నప్రసాద వితరణ నిర్వహించి, సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగింపుగా హుస్సేన్ సాగర్‌కు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్ ప్రమాణిక్, ఉపాధ్యక్షులు బిస్వనాథ్ మాజీ, కార్యదర్శి రాజు పండిత్, సభ్యులు కింకర్ మైతీ, సుకుమార్ దారా, ఆరూప్ కర్మకార్ తదితర కార్యవర్గ సభ్యులు పూజా కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

## పూలే విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

**ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** వరంగల్ ఉర్సు కరీమాబాద్ దర్గా ప్రాంతం ఆటో స్టాండ్ వద్ద మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో పూలే విగ్రహానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి పూలే అని కొనియాడారు. పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ అంసా అధ్యక్షుడు సైదులు, ఎంఎస్‌ఎఫ్ నాయకులు స్వామి, బీసీ విద్యార్థి సంఘం నాయకులు లింగయ్యయాదవ్, రవీందర్, విజయ్‌నాయక్, అంబేడ్కర్, అర్జున్, గీత, సృజన, సౌమ్య, మల్లేశ్వరి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## రేడియాలాజికల్ ఫిజిక్స్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

**ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో, నగరంలోని ప్రముఖ ఆస్పత్రుల సహకారంతో నిర్వహిస్తున్న పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియాలాజికల్ ఫిజిక్స్ కోర్సు (2025-26)లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు ఫిజిక్స్/న్యూక్లియర్ ఫిజిక్స్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి నవంబరు 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, రూ.500 లేటు ఫీజుతో నవంబరు 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నవంబరు 30న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలని, పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఓయూ అడ్మిషన్స్.కాం, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్లను సందర్శించాలని పాండు రంగారెడ్డి సూచించారు.